నేడు రక్తదాన శిబిరం

పెద్ద కొడప్‌గల్‌లో రక్తదాన శిబిర ప్రచార పత్రాలను అందజేస్తున్న సంస్థాన నిర్వాహకులు

పెద్ద కొడప్‌గల్, జనవరి 5 : జగద్గురు నరేంద్రాచార్య మహరాజ్ సంస్థానం ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని హనుమాన్ మందిర్ పాత గ్రామ పంచాయతీ కార్యాలయంలో సోమవారం రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు సంస్థాన నిర్వాహకులు తెలిపారు. ఆదివారం నిర్వాహకులు శిబిరం ప్రచార పత్రాలను విడుదల చేశారు. ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో రక్త దాతలు హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గంగారాం, తానాజీరావు, చందర్ తదితరులు పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలని వినతి

జహీరాబాద్ ఎంపీకి వినతి పత్రం అందజేస్తున్న నాయకులు

రామారెడ్డి, జనవరి 5 : రామారెడ్డి మండల అభివృద్ధికి ఎంపీ నిధులు కేటాయించాలని మాజీ జడ్పీటీసీ సభ్యుడు నారెడ్డి మోహన్‌రెడ్డి, స్థానిక నాయకులు స్థానిక ఎంపీ సురేశ్‌షెట్కార్‌కు ఆదివారం వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎంపీకి నూతన సంవత్సర శుభాంకాంక్షలు తెలిపారు. మండలంలోని ప్రధాన దేవాలయాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎంపీకి విన్నవించారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో నాయకులు నారెడ్డి మహిపాల్‌రెడ్డి, టంకరి నర్సింహులు, బండి పోచయ్య, సుద్దాల లింగం, పోసానిపేట గ్రామస్తులు ఉన్నారు.

క్యాలెండర్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నాగిరెడ్డిపేట, జనవరి 5: తాండూర్ త్రిలింగేశ్వరాలయ నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఎమ్మెల్యే మదన్‌మోహన్‌రావు హైదరాబాద్‌లోని తన నివాసంలో ఆదివారం ఆవిష్కరించారు. తనకు ఎంతో ఇష్టమైన స్వామివారి ఆలయ క్యాలెండర్‌ను ఆవిష్కరించడం సంతోషంగా ఉన్నదని, త్రిలింగేశ్వరాలయ అభివృద్ధికి తాను నిరంతరం కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని కాంగ్రెస్ నాయకులు ఆయనకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో త్రిలింగేశ్వరాలయ కమిటీ అధ్యక్షుడు కొమ్మ దత్తు, నాయకులు శ్రీధర్‌గౌడ్, రాంచంద్రారెడ్డి, వాస్‌రెడ్డి, విక్రాంత్‌రెడ్డి, సంజీవులు, కిష్టయ్య, సురేందర్‌గౌడ్, రవిగౌడ్ తదితరులు ఉన్నారు.

దుమ్ముతో ప్రయాణికుల ఇక్కట్లు

బిచ్కుంద మండల కేంద్రంలో ప్రధాన రహదారిపై లేస్తున్న దుమ్ము

రోడ్డుకు ఇరువైపులా కొనసాగుతున్న మురికి కాలువల నిర్మాణం

- చోద్యం చూస్తున్న అధికారులు
- ఆహార పదార్థాలపై పేరుకు పోతున్న దుమ్ము
- శ్వాస కోస వ్యాధుల బారిన పడుతున్న జనం

బిచ్కుంద, జనవరి 4 : మండల కేంద్రంలో చేపట్టిన సెంట్రల్ లైటింగ్ పనుల్లో భాగంగా రోడ్డుకు ఇరువైపులా మురుగు కాలువల నిర్మాణ పనులు కొనసాగుతున్నాయి. మురుగు కాలువల నిర్మాణం కోసం తవ్విన మట్టిని రోడ్డుకు ఇరువైపులా పోయడంతో, వాహనాల రాక పోకలతో విపరీతమైన దుమ్ము వస్తున్నది. దీంతో వ్యాపారస్తులతో పాటు ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దుమ్ముతో ప్రజారోగ్యంపై నేరుగా ప్రభావం చూపుతున్నాయి. రోడ్డు పక్కనే టిఫిన్ సెంటర్లు, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లు, పండ్ల దుకాణాలు, చికెన్ సెంటర్లు కొనసాగుతున్నాయి. దుమ్ము పేరుకు పోయిన ఆహార పదార్థాల విక్రయాలు ప్రజల ఆరోగ్యానికి మరింత హాని చేస్తున్నాయి. ఈ విషయంపై గత సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో సబ్ కలెక్టర్‌కు స్థానికులు ఫిర్యాదు చేశారు. అయినప్పటికీ అధికారుల్లో స్పందన కనబడడం లేదు. ఈ రహదారి వెంట నిత్యం ప్రయాణించే వారితో పాటు రహదారి వెంట వ్యాపారాలు నిర్వహించే వారిలో పలువురికి శ్వాస కోశ, కంటి సమస్యలు వస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రోడ్డు విస్తరణ పనులు సాగుతున్న రహదారి వెంట టిఫిన్ సెంటర్లు, హోటళ్లు, చికెన్ సెంటర్లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో దుమ్ముతో పేరుకు పోయిన ఆహారం తీసుకుంటే జీర్ణ కోశ వ్యాధులు వచ్చే ప్రమాదముందని వైద్యనిపుణులు అంటున్నారు.

నిబంధనల ఉల్లంఘన..

సాధారణంగా జనావాసాల మధ్య ఎలాంటి అభివృద్ధి పనులు జరిగినా ప్రజలకు ఇబ్బంది కలగకుండా చర్యలు తీసుకోవాలి. దుమ్ము లేవకుండా రహదారిపై నీళ్లు చల్లాలి. కాని అధికారులు నామమాత్రంగా చేపడుతున్నారని ప్రజలు వాపోతున్నారు. తాము దుమ్ము దూళితో ఇబ్బంది పడుతున్నప్పటికీ అధికారులు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

దుమ్ము వల్ల జలుబు, దగ్గు వస్తున్నాయి..

మండల కేంద్రంలో సెంట్రల్ లైటింగ్ పనులు చేస్తున్నారు. ఈ పనుల వల్ల రోడ్డు పై దుమ్ము లేసి మా దుకాణాల్లో కూర్చో లేకపోతున్నాం. దుమ్ము ద్వారా జలుబు, దగ్గు లాంటి వ్యాధులు వస్తున్నాయి. చాలా ఇబ్బందులకు గురవుతున్నాం. పంచాయతీ అధికారులు స్పందించి దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలి.

–నంది రాజు, వ్యాపారస్తుడు, బిచ్కుంద

రోడ్డు మీది దుమ్ము దుకాణంలోకి వస్తున్నది..

నేను ఫర్టిలైజర్ దుకాణంలో పని చేస్తా. రోడ్డు పనుల కోసం మురికి కాలువలు తోడుతున్నారు. దీంతో రోడ్డు మీద దుమ్ము మా దుకాణంలోకి వస్తున్నది. దీంతో సర్ది, దగ్గుతో బాధ పడుతున్న. అధికారులు దుమ్ము లేవకుండా చర్యలు తీసుకోవాలి. –బాలు, బిచ్కుంద

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి

పెద్దకొడప్‌గల్, జనవరి 5 : ప్రజలు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని ఏఎస్సై రాములు అన్నారు. మండలంలోని బేగంపూర్ చౌరస్తా జాతీయ రహదారి 161పై ఆదివారం ప్రజలకు సైబర్ నేరాలపై పోలీసులు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఏఎస్సై మాట్లాడుతూ వాహనాలను వ్యతిరేక మార్గంలో, మద్యం సేవించి, సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ నడపవద్దన్నారు. వాహనాలకు సంబంధించిన ధ్రువపత్రాలను దగ్గర ఉంచుకోవాలన్నారు. సామాజిక మాధ్యమాల్లో వచ్చే మెస్సేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది సాయిశివ, రమేశ్, జైపాల్‌రెడ్డి, అంజి తదితరులు పాల్గొన్నారు.

మద్యం సేవించి వాహనాలు నడపరాదు..

లింగంపేట, జనవరి 5: వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని ఎస్సై సుధాకర్ సూచించారు. పోలీస్ స్టేషన్ వద్ద వాహనాలను తనిఖీ చేసి డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహించారు. మద్యం సేవించి వాహనాలు నడుపుతున్న వారిపై కేసులు నమోదు చేశారు. వాహనదారులు కచ్చితంగా హెల్మెట్ ధరించాలని సూచించారు.

లింగంపేట పోలీస్ స్టేషన్ ఎదుట డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు నిర్వహిస్తున్న పోలీసులు

హ్యాపీ న్యూ ఇయర్ మేడం

ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవితను హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో బీఆర్ఎస్ కామారెడ్డి పట్టణ అధ్యక్షుడు జూకంటి ప్రభాకర్‌రెడ్డి శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆమెకు పండ్లు అందజేసి నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపారు.

- కామారెడ్డి, జనవరి 5

రేషన్ బియ్యం లారీలకు పోలీసు బందోబస్తు

ఎల్లారెడ్డి ఎంఎల్ఎస్ పాయింట్ గోదాం వద్ద బందోబస్తు నిర్వహిస్తున్న పోలీసులు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 5: రేషన్ దుకాణాలకు బియ్యం తరలించే లారీలకు పోలీసులు ఆదివారం బందోబస్తు నిర్వహించారు. ఐదు రోజులుగా సివిల్ సప్లయిస్ హమాలీలు ధర్నాలో ఉన్న కారణంగా ఎక్కడికక్కడ పనులు నిలిచిపోయాయి. రేషన్‌దుకాణాలకు బియ్యం తరలించాల్సి ఉండగా పోలీసులు బందోబస్తు నిర్వహించి ప్రైవేట్ హమాలీలతో రేషన్ బియ్యాన్ని లారీల్లో లోడ్ చేయించి రేషన్ దుకాణాలకు తరలించారు. సమ్మెలో ఉన్న హమాలీలు ఎటువంటి గొడవలు సృష్టించకుండా పోలీసు బందోబస్తు చేపట్టినట్లు ఎస్సై బొజ్జ మహేశ్ తెలిపారు. బందోబస్తు నిర్వహించిన వారిలో ఏఎస్సైలు నరేందర్, ప్రకాశ్, జమ్మేదార్ శ్రీను, కానిస్టేబుళ్లు ఉన్నారు.

పాఠశాలలకు ఐదు రోజుల సెలవు

ఎల్లారెడ్డిరూరల్, జనవరి 5: సంక్రాంతి పండుగకు ప్రభుత్వం ఐదు రోజుల సెలవు ప్రకటించినట్లు మండల ప్రత్యేకాధికారి వెంకటేశం ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. జనవరి 14వ తేదీన సంక్రాంతి ఉన్నందున ప్రభుత్వం 13వ తేదీ సోమవారం నుంచి 17వ తేదీ శుక్రవారం వరకు ఐదు రోజులను సెలవుగా ప్రకటించినట్లు పేర్కొన్నారు. కాగా 11,12వ తేదీల్లో రెండో శనివారం, ఆదివారం రావడంతో సెలవులు వారం రోజులుగా ఉండనున్నాయని తెలిపారు. తిరిగి 18వ తేదీ శనివారం పాఠశాలలు పునఃప్రారంభమవుతాయన్నారు. కాగా జూనియర్ కళాశాలలకు 11వ తేదీ నుంచి 16వ తేదీ వరకు ప్రభుత్వం సెలవులను ప్రకటించింది.

గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలి

సమావేశంలో మాట్లాడుతున్న విద్యార్థి సేనా జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్

విద్యార్థి సేనా జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్

కామారెడ్డి, జనవరి 5: గెస్ట్ లెక్చరర్ల సమస్యలు పరిష్కరించాలని విద్యార్థి సేనా జిల్లా అధ్యక్షుడు వినయ్‌కుమార్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కామారెడ్డిలో ఆదివారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో బోధిస్తున్న గెస్ట్ లెక్చరర్లు సమస్యలతో సతమతవుతున్నారని అన్నారు. ఉద్యోగ భద్రత లేకపోవడం బాధాకరమైన విషయం అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టు తీర్పు మేరకు పనికి తగిన వేతనం చెల్లించాలని కోరారు. కొన్ని రోజులుగా సమ్మె చేస్తున్న సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగులపై ప్రభుత్వం చిన్న చూపుచూస్తున్నదని ఆరోపించారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయని పక్షంలో కనీసం పే స్కేల్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో విద్యార్థి సేనా నాయకులు సాయిరాం, ప్రభాకర్, రాహుల్, శ్రీకాంత్ పాల్గొన్నారు.

జోరుగా వరినాట్లు

బాన్సువాడ, జనవరి 5: బాన్సువాడ డివిజన్‌లో వరి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. బాన్సువాడ మండలంలోని కొల్లూర్, నాగారం, చింతల్ నాగారం, సోమేశ్వర్, దేశాయిపేట్ గ్రామాల్లో యాసంగి సీజన్‌లో నాట్లు జోరందుకున్నాయి. కొన్ని గ్రామాల్లో ఇప్పటికే నాటు వేయడం పూర్తయ్యింది. మహిళా కూలీలు ఎకరం నాటు వేయడానికి 4,500 నుంచి రూ.ఐదు వేల వరకు కూలి తీసుకుంటున్నారు. ఉత్తర ప్రదేశ్, పశ్చిమ బెంగాల్ తదితర రాష్ట్రాల నుంచి మగవారు నాటు వేయడానికి రావడంతో గ్రామాల్లో కూలీల కొరత లేకుండా పోయింది. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన కూలీలకు రూ.4,500 ఎకరాన చెల్లించి నాట్లు వేయిస్తున్నారు. వేరే రాష్ట్రాల నుంచి కూలీల రాకుంటే నాటు వేయడానికి ఇబ్బంది ఉండేదని రైతులు అంటున్నారు.

కొల్లూర్ శివారులో నారు కట్టలు కడుతున్న కూలీలు

ఆదర్శ పాఠశాలలో ప్రవేశ పరీక్షకు దరఖాస్తుల స్వీకరణ

బాన్సువాడ రూరల్, జనవరి 5: బాన్సువాడ మండలంలోని కొత్తాబాది మోడల్ స్కూల్‌లో 2025-2026 సంవత్సరానికి 6వ తరగతిలో కొత్తగా అడ్మిషన్లు, 7 నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్లలో భర్తీ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ కమల్ కిశోర్ ఆదివారం తెలిపారు. ఈనెల 6 నుంచి 28 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు మార్చి 4న ప్రవేశ పరీక్ష ఉంటుందని తెలిపారు. అర్హులైన విద్యార్థులు తమ ధ్రువీకరణ పత్రాలతో ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

గిరిజన విద్యార్థి సంఘం నూతన కార్యవర్గం ఎన్నిక

జిల్లా అధ్యక్షుడిగా వినోద్ చౌహాన్ నాయక్

అభివాదం చేస్తున్న నూతన కార్యవర్గ సభ్యులు

కామారెడ్డి, జనవరి 5: గిరిజన విద్యార్థి సంఘం జిల్లా కార్యవర్గ సమావేశాన్ని కామారెడ్డిలోని కర్షక్ బీఈడీ కాలేజీలో ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. గిరిజన విద్యార్థి సంఘం జిల్లా అధ్యక్షుడిగా సభావత్ వినోద్ చౌహాన్ నాయక్, ప్రధాన కార్యదర్శిగా మెగావత్ సాగరిక, సభావాత్ సంతోష్ నాయక్, ఉపాధ్యక్షుడిగా మాలోత్ నవీన్ నాయక్, కార్యదర్శిగా మెగావత్ మురళీ నాయక్ ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జాతీయ గౌరవ అధ్యక్షుడు మోతీలాల్ నాయక్, జాతీయ అధ్యక్షుడు ఇందల్ రాథోడ్, జాతీయ కార్యవర్గ అధ్యక్షుడు వెంకట్ బంజారీ, రాష్ట్ర అధ్యక్షుడు రమేశ్ నాయక్, ప్రధాన కార్యదర్శి భాస్కర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

భవన నిర్మాణరంగ కార్మికులకు రక్తపరీక్షలు

వెంకటాపూర్ ఆగ్రహారంలో భవన నిర్మాణ రంగ కార్మికులకు రక్త పరీక్షలు చేస్తున్న వైద్యుడు

ఎల్లారెడ్డి రూరల్, జనవరి 5: మండలంలోని వెంకటాపూర్ ఆగ్రహారంలో ఆదివారం భవన నిర్మాణరంగ కార్మికులకు రక్తపరీక్షలు నిర్వహించారు. మత్తమాల వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో రక్త పరీక్షలను చేపట్టారు. తాపీమేస్త్రీలు, ప్లంబర్లు తదితర రంగాలకు చెందిన 15 మంది కార్మికులకు ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పరీక్షలు చేశారు. కార్యక్రమంలో సంఘ నాయకుడు మర్లు సాయిబాబు, సభ్యులు బాల్‌రాజ్, భాను, గంగారం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లం ప్రయాణ ప్రాంగణం.. ప్రైవేట్ వాహనాలకు నిలయం

పిట్లం బస్టాండులో నిలిచి ఉన్న ప్రైవేటు వాహనాలు

పెద్దకొడప్‌గల్, జనవరి 4 : పిట్లం మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండు ప్రైవేట్ వాహనాలకు నిలయంగా మారింది. అధికారుల నిర్లక్ష్యంతో బస్టాండులో ప్రభుత్వ బస్సులు ఉన్నప్పటికీ ప్రైవేట్ వాహనాలు బస్టాండులో నిలిపి ప్రయాణికులను తీసుకెళ్తున్నారు. బస్టాండులో హైదరాబాద్ నుంచి పిట్లం, బిచ్కుంద వైపు వెళ్లే బస్సు లు, పిట్లం నుంచి సంగారెడ్డి, హైదరాబాద్ వైపు బస్సులు ఉన్నప్పటికీ ప్రైవేట్ వాహనాలు తీవ్ర ఆటంకాన్ని కలిగిస్తున్నాయి. అధికారు లు స్పందించి తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మాస్టర్ అథ్లెటిక్స్‌లో పతకాలు

కామారెడ్డి/ రాజంపేట్, జనవరి 5: రంగారెడ్డి జిల్లాలో ఇటీవల నిర్వహించిన స్టేట్ లెవల్ పోటీల్లో కామారెడ్డి జిల్లా మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ క్రీడాకారులు గోల్డ్, సిల్వర్, బ్రౌన్ పతకాలు సాధించారని మాస్టర్స్ అథ్లెటిక్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు రంజిత్ మోహన్, ప్రధాన కార్యదర్శి నరేశ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నవీన్ రెడ్డి, సతీశ్ రెడ్డి, చంద్రశేఖర్ గోల్డ్ మెడల్, సునీల్ రెడ్డి, దినేశ్ సిల్వర్ మెడల్, అతీఖుల్లా, నరేందర్, హరీశ్ బ్రాన్స్ మెడల్స్ సాధించారు. సాధించిన క్రీడాకారులను అసోసియేషన్ సభ్యులు అభినందించారు.

పతకాలు సాధించిన జిల్లా క్రీడాకారులు

బాధిత కుటుంబానికి ఆర్థిక సహాయం

మాజీ విప్ గోవర్ధన్ పంపించిన ఆర్థిక సహాయం అందజేస్తున్న నాయకులు

మాచారెడ్డి, జనవరి 5: మాచారెడ్డి మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ కార్యకర్త నర్సింహులు తల్లి అనారోగ్యంతో ఇటీవల మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే గంప గోవర్ధన్ తనవంతు తక్షణ సహాయంగా రూ.ఐదు వేలు స్థానిక నాయకుల ఆధ్వర్యంలో బాధిత కుటుంబానికి అందజేశారు. కార్యక్రమంలో మాచారెడ్డి మండల యూత్ ప్రధాన కార్యదర్శి, గ్రామ ఇన్‌చార్జి చల్లా కృష్ణారెడ్డి, బీఆర్ఎస్ సీనియర్ నాయకులు అంబటి నారాయణ, బాలరాజాగౌడ్, నీరటి రాజు, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

వేల్పూర్ చెక్‌డ్యామ్‌లో భారీ చేప లభ్యం

వేల్పూర్ జనవరి 5: మండల కేంద్రంలోని చెక్‌డ్యామ్‌లో అరుదైన చేప బొచ్చ లభించింది. సుమారు 15 కిలోల చేప దొరకడంతో గంగపుత్రుడు బండి కిషన్ సంతోషం వ్యక్తంచేశారు. గతంలో ఎప్పుడూ ఇంత పెద్దచేప చెరువులు, వాగుల్లో లభించలేదన్నారు. కేసీఆర్ ప్రభుత్వ హయాంలో మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి చెక్‌డ్యామ్ నిర్మాణానికి కృషి చేశారు. దీంతో చెక్‌డ్యామ్ సమీపంలో నీరు నిల్వ ఉండడంతో నీటిలో చేపలు పెరిగాయని, దీని ద్వారా తమకు ఆదాయం వస్తున్నదని అన్నారు. ఆదివారం చెక్‌డ్యామ్ సమీపంలో చేపలు పడుతుండగా 15 కిలోల చేప చిక్కిందన్నారు.

దేవాగౌడ్‌కు 'పండుగ సాయన్న' పురస్కారం

మాచారెడ్డి, జనవరి 5 : మండలంలోని ఫరీద్‌పేట గ్రామానికి చెందిన కళాకారుడు కర్రోళ్ల దేవాగౌడ్‌కు 'పండుగ సాయన్న' రాష్ట్రస్థాయి పురస్కారం లభించింది. హైదరాబాద్‌లోని బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆయనకు పురస్కారాన్ని అందజేశారు. ఈ సందర్భంగా దేవాగౌడ్ మాట్లాడుతూ.. పండుగ సాయన్న స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి అవార్డు-2025 రావడం సంతోషంగా ఉన్నదన్నారు.

పురస్కారాన్ని అందుకుంటున్న సాయన్న

గాంధారి అంగట్లో సెల్‌ఫోన్ల చోరీ

గాంధారి, జనవరి 5: మండల కేంద్రంలోని వారాంతపు సంతలో సెల్‌ఫోన్ దొంగలు తమ చేతి వాటం చూపిస్తున్నారు. ఆదివారం నిర్వహించే అంగడికి మండలంలోని చుట్టు పక్కల గ్రామాల వారితోపాటు సదాశివనగర్, తాడ్వాయి, లింగంపేట్, బాన్సువాడ తదితర మండలాల నుంచి ప్రజలు పెద్ద సంఖ్యలో వస్తుంటారు. ప్రతి వారం అంగడిలో గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్లు దొంగిలిస్తున్నారు. ఆదివారం మండల కేంద్రానికి చెందిన సతీశ్ అనే యువకుడు బస్టాండ్‌లో బస్సు ఎక్కుతుండగా గుర్తు తెలియని వ్యక్తులు అతని సెల్‌ఫోన్ దొంగిలించారు.

అలాగే సదాశివనగర్ మండలం తుక్కాజివాడికి చెందిన వ్యక్తి అంగడికి సరుకులు కొనడానికి రాగా అతని సెల్‌ఫోన్ దొంగిలించారు. ప్రతి వారం అంగడిలో నాలుగైదు సెల్‌ఫోన్లను దొంగిలిస్తున్నారు. సెల్‌ఫోన్లు చోరీ కాకుండా పోలీసులు ప్రత్యేక నిఘా పెట్టి చర్యలు తీసుకోవాలని మండల ప్రజలు కోరుతున్నారు.